## జడ్పీహెచ్‌ఎస్‌ను సందర్శించిన అదనపు కలెక్టర్



విద్యార్థులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాధిక గుప్తా

**కూకట్‌పల్లి:** కూకట్‌పల్లి జడ్పీహెచ్‌ఎస్‌ను డీఈఓ విజయకుమార్‌తో కలిసి జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా బుధవారం సందర్శించారు. 10వ తరగతి విద్యార్థులతో సమావేశమయ్యారు. సెంట్రల్ స్క్వేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంఈఓ, సీహెచ్‌ఎంలకు నిర్వహిస్తున్న సపోర్టివ్ సూపర్‌వైజర్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని పరిశీలించారు.

## సమస్యల పరిష్కారానికి కృషి

**మూసాపేట:** బాలాజీనగర్ డివిజన్‌లోని 15వ ఫేజ్‌లో స్థానిక సమస్యలపై బుధవారం మాజీ కార్పొరేటర్ బాబూరావు కాలనీలో పర్యటించారు. సమస్యలను అధికారుల దృష్టికి, ఎమ్మెల్యే కృష్ణారావు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం చేస్తానని అన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, బండాబదల భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ కేపీహెచ్‌బీ యూనిట్ ఎన్నికలు



ఎన్నికల్లో పాల్గొన్న రిటైర్డ్ ఉద్యోగులు

**కూకట్‌పల్లి:** తెలంగాణ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ కేపీహెచ్‌బీ యూనిట్ ఎన్నికలు బుధవారం కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డులోని పార్కులో ఉన్న అసోసియేషన్ ఆవరణలో జరిగాయి. అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వెంకటరాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి కె. వెంకయ్య, ఘట్‌కేసర్ యూనిట్ అధ్యక్షులు రంగయ్య ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా డా. గిరిధర్, ప్రధాన కార్యదర్శిగా బి. రవికుమార్, ట్రెజరర్‌గా లలిత కుమారి, ఉపాధ్యక్షులుగా సుదర్శనం, వై భారతి, అసోసియేట్ అధ్యక్షుడిగా రామనాథం, ఆర్గనైజింగ్ సెక్రటరీగా నందయ్య, పబ్లిసిటీ సెక్రటరీగా డా. సుబ్బారావు, జాయింట్ సెక్రటరీగా కిషన్‌లను ఎన్నుకున్నారు.

## హెచ్‌సీయూలో నిరసన



**రాయదుర్గం:** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థులు నిరసన తెలిపారు. బుధవారం సాయంత్రం బీఎస్‌ఎఫ్, డీఎస్‌యూ, ఎస్‌ఎఫ్‌ఐ, టీఎస్‌ఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో నార్త్ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ బేషరతుగా వెంటనే సోనమ్ వాంగ్‌చుక్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పలువురు బీఎస్‌ఎఫ్, డీఎస్‌యూ, ఎస్‌ఎఫ్‌ఐ, టీఎస్‌ఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు, సభ్యులు పాల్గొన్నారు.

# నత్తనడకన సీసీ రోడ్డు పనులు

- వర్షంతో బురదమయం
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



అధ్వానంగా మారిన బోయిన్ చెరువు రహదారి

**ఓల్డ్ బోయిన్‌పల్లి:** ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లోని హస్మత్‌పేట బోయిన్ చెరువు కట్టపై సీసీ రోడ్డు నిర్మాణ పనులు ముందుకు సాగకపోవడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత నెల 4న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కార్పొరేటర్‌తో కలిసి రూ. కోటి రూపాయల వ్యయంతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. నెల రోజులు గడుస్తున్న రోడ్డు నిర్మాణం జరగకపోవడంతో పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బోయిన్ చెరువు కట్ట రోడ్డు ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌కు ప్రధాన రహదారిలో ఒకటి. వాహనదారులు ఆ రోడ్డు గుండా ప్రయాణించాలంటే నరకం కనిపిస్తుందని పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

### ఫుట్‌పాత్‌పై వాహనాల రాకపోకలు

బోయిన్ చెరువు కట్టపై ఉన్న రహదారి అధ్వానంగా తయారై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సీసీ రోడ్డు నిర్మాణం అంటూ రోడ్డును తవ్వడంతో రాకపోకలు ఫుట్‌పాత్‌లపై సాగిస్తున్నారు. దీంతో చెరువు కట్టకు ఇరువైపులా ఇటీవల కోట్లాది రూపాయలతో ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్, పూలకుండీలు ధ్వసమయ్యాయి. చెరువుకు అందం తెచ్చిపెట్టిన వాకింగ్ ట్రాక్, పూలకుండీలు ధ్వంసం అవుతున్నా అటు అధికారులు, ఇటు కాంట్రాక్టర్ నీమ్మకు నీరెత్తినట్లు వ్యవరిస్తున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి సీసీ రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని, ధ్వంసమైన ఫుట్‌పాత్‌లను, పూలకుండీలను బాగుచేయించాలని ప్రజలు కోరుతున్నారు.



వాకింగ్ ట్రాక్‌పై నుంచి వెళ్తున్న వాహనాలు

## అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతా



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణారావు, కాలనీవాసులు

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**మోతీనగర్:** అభివృద్ధిలో డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బుధవారం మూసాపేట డివిజన్ అవంతినగర్ తోట సంక్షేమ సంఘం, శ్రీ సాయి ఉమామహేశ్వర వినాయక ఆంజనేయస్వామి ఆలయ కమిటీ సంయుక్తంగా అవంతినగర్ తోట ప్రధాన రోడ్డుపై ఆలయ ముఖ ద్వార నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయాలు మానసిక ప్రశాంతతకు కేంద్ర బిందువులని, అలాంటి ఆలయాలకు వెళ్లడానికి సులభంగా దారి తెలుసుకోవడానికి ఆలయ ముఖ ద్వారాలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శ్రావణ్‌కుమార్, సంక్షేమ సంఘం అధ్యక్షులు జి. వెంకటేశ్వర్లు, మాజీ అధ్యక్షులు గార్లపాటి మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ స్వామి, కన్వీనర్లు విశ్వకర్మ రామాయన్ టీవీ సుబ్బారావు, నాయకులు పినిపే చిన్న అబ్బులు, ఫణికుమార్ పాల్గొన్నారు.

## దసరా ఆర్టీసీ ప్రయాణికుల లక్కీ డ్రా



లక్కీ డ్రా తీస్తున్న ఆర్‌ఎం సుచరిత తదితరులు

**మూసాపేట:** కూకట్‌పల్లి, ప్రశాంతినగర్ బస్ టెర్మినల్‌లో బుధవారం ఆర్‌ఎం సుచరిత లక్కీ డ్రా తీసి విజేతలను ప్రకటించారు. దసరా పండుగ సందర్భంగా సెప్టెంబర్ 27 నుంచి అక్టోబర్ 6 వరకు మెట్రో డీలక్స్, డీలక్స్, సూపర్ లగ్జరీ, ఏసీ బస్సుల్లో ప్రయాణించిన ప్రయాణికులకు లక్కీ డ్రా తీశారు. మొదటి బహుమతి రూ.25 వేలు ఎస్ రమణా చారి, రాంపల్లి కీసర, రెండవ బహుమతి గౌతమ్ రాజ్ రూ.15 వేలు, ఘట్‌కేసర్ నివాసి సుజాత రూ.10 వేలు గెలుచుకున్నారని ఆమె తెలిపారు. త్వరలో రాష్ట్ర స్థాయిలో అందరికీ ఒకే సారి బహుమతులు అందజేస్తామని అన్నారు. దసరా పండుగ వేళల్లో ఆర్టీసీ బస్సులో ప్రయాణించి టికెట్ డ్రా బాక్స్‌లో వేశారని, వాటిని డ్రా తీశామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎం అపర్ణ కల్యాణి, డిప్యూటీ ఆర్‌ఎం చౌహాన్, కూకట్‌పల్లి డిపో మేనేజర్ హరి, జీడిమెట్ల డిపో మేనేజర్ వెంకటేశం, అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత, మెకానికల్ ఇంజనీరింగ్ బాలరాజు, ఉద్యోగస్తులు, ప్రయాణికులు పాల్గొన్నారు.

## ఎఫ్‌డీడీఐ-హెచ్‌లో క్రీడోత్సవాలు



**రాయదుర్గం:** ఇబ్టిటా-2025 కార్యక్రమంలో భాగంగా రాయదుర్గంలోని ఎఫ్‌డీడీఐ-హెచ్ క్రీడోత్సవాలు పోటాపోటీగా సాగుతున్నాయి. ఎఫ్‌డీడీఐ క్యాంపస్‌లో సందడి నెలకొంది. బుధవారం ఎఫ్‌డీడీఐ-హెచ్ క్యాంపస్‌లోని క్రికెట్ గ్రౌండ్‌లో ఫ్యాకల్టీ-స్టూడెంట్స్ మధ్య పోటీ నిర్వహించారు. ఇందులో ఫ్యాకల్టీ టీమ్ భారీ విజయాన్ని సాధించింది. 20 ఓవర్లలో ఫ్యాకల్టీ జట్టు 175 పరుగులు సాధించారు. ఈ సందర్భంగా ఈడీ డాక్టర్ తేజ్‌లోహిత్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ఆటవిడుపు కోసం ప్రతి యేటా ఇలాంటి పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీ ప్రతినిధులు డాక్టర్ ముప్పిడి రాంబాబు, హరిహరన్, డాక్టర్ వికాస్, గౌరబ్‌సింగ్, గోఫ్రాన్, వేణు, నరేష్, సార్థికా, మిశ్రాచ నిరంజన్, పింటూజీ, అంకణ్‌జీ, సుజిత్ రహమాన్, దిలీప్, అభినవ్, విద్యార్థులు పాల్గొన్నారు.

## నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలి



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తదితరులు

**ఆల్విన్‌కాలనీ:** డివిజన్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని పీజేఆర్ నగర్ కాలనీలో రూ.19.80 లక్షల నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం కాలనీ వాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాల విషయంలో రాజీ పడకుండా యుద్ధ ప్రాతిపదిక పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జి. రవి, గోపి, ఆంజనేయులు, నారాయణ, చిన్న కన్న, ప్రవీణ్, రవీందర్ రెడ్డి, రాజు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులు పూర్తి చేయాలి



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం

కార్పొరేటర్ సబిహాబేగం

**మోతీనగర్:** సీసీ రోడ్డు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కార్పొరేటర్ సబిహాబేగం అన్నారు. అల్లాపూర్ డివిజన్ పరిధిలోని వివేకానందనగర్‌లో సీసీ రోడ్డు పనులను స్థానికులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు మౌలిక వసతులు అందించటమే తమ లక్ష్యం అని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రోణంకి జగన్నాథం, తుంగం శ్రీనివాస్ రావు, రవీందర్ రెడ్డి, మధుసూదనాచారి, ఏ. రమేష్, రోశయ్య, బండారి ప్రసాద్‌రావు, స్వామి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల ప్రతిపాదనలు అందజేత



ఎంపీకి అభివృద్ధి పనుల ప్రతిపాదనలు అందజేస్తున్న నాయకులు, ప్రతినిధులు

**ఓల్డ్ బోయిన్‌పల్లి:** హనుమాన్‌నగర్ అభివృద్ధి పనుల కోసం అధికారులు తయారు చేసిన ప్రతిపాదనలను బుధవారం ఎంపీ ఈటల రాజేందర్‌కు అందజేశారు. అధికారులతో చర్చించి రూ.2 కోట్ల నిధులతో అభివృద్ధి పనుల ప్రతిపాదనలు రూపొందించినట్లు నాయకులు తెలిపారు. డ్రైనేజీ వ్యవస్థకు కోటి రూపాయలు, మంచినీటి పైపులైన్లకు కోటి రూపాయలతో పాటు హరిజన బస్తీ, వడ్డెర బస్తీలో డ్రైనేజీ వ్యవస్థకు రూ. 5 లక్షల నిధుల ప్రతిపాదనలను ఎంపీకి అందజేశారు. ఎంపీ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు ఎనుగుల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వరసిద్ధి వినాయక ఆలయ వార్షిక వేడుకలు



హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

**కూకట్‌పల్లి:** కూకట్‌పల్లిలోని స్వాన్‌లేక్ అపార్టుమెంట్‌లోని వరసిద్ధి వినాయక దేవాలయం ప్రథమ వార్షికోత్సవ వేడుకలు బుధవారం నిర్వహించారు. ఉదయం 8 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచనం, అంకురారోహణం, అఖండ దీపారాధన, ఋత్విక్ వరణం, పంచగవ్యపాసన, యాగశాల ప్రవేశం, నవగ్రహ, వాస్తు క్షేత్రపాల, యోగిని బ్రహ్మాది మండల స్థాపనము, తీర్థ ప్రసాద వితరణ వంటి కార్యక్రమాలతో పూజలు జరిగాయి. గురువారం ఉదయం 8 గంటల నుంచి అష్టోత్తర శత కలశ స్థాపన, ఆవాహిత దేవతా హోమం, హారతి మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వితరణ జరుగుతుందని స్వాన్‌లేక్ అపార్టుమెంట్ దేవాలయ కమిటీ సభ్యులు తెలిపారు.

## వృథాగా తాగునీరు.. పట్టించుకోని అధికారులు



వృథాగా పోతున్న మంచినీటిని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

**ఆల్విన్‌కాలనీ:** వివేకానందనగర్ డివిజన్ కమల ప్రసన్న నగర్ మెయిన్ రోడ్డులో 10 రోజుల నుంచి మంచినీరు వృథాగా పోతుంది. దీనిపై బీజేపీ డివిజన్ అధ్యక్షులు డాక్టర్ ఎస్. వంశీరెడ్డి అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా అధికారులు సమస్యను పరిష్కరించలేదు. నీటి వృథాతో కమల ప్రసన్న నగర్ రోడ్డు మొత్తం బురదమయంగా తయారైంది. ఎమ్మెల్యే గాంధీ నివాసం ఉంటున్న డివిజన్‌లో ఇలా ఉంటే వేరే డివిజన్‌ల పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని నాయకులు ఎద్దేవా చేశారు. సమస్యను పరిష్కరించకుంటే ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

## బొటానికల్ గార్డెన్‌లో వన్యప్రాణి వారోత్సవాలు



**గచ్చిబౌలి:** ప్రపంచ వన్యప్రాణి వారోత్సవాలను బుధవారం కొత్తగూడలోని బొటానికల్ గార్డెన్‌లో నిర్వహించారు. తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అక్టోబర్ 2 నుంచి 8వ తేదీ వరకు పాలపిట్ట పండుగ, ఇతర కార్యక్రమాలను నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులను బాగస్వాములను చేశారు. చెట్లు, జంతువులు, పక్షులు, పాముల గురించి అవగాహన కల్పించారు. విద్యార్థులకు ఆన్‌లైన్ డ్రాయింగ్, పోస్టర్ మేకింగ్, వన్యప్రాణి ఫొటోగ్రఫీ పోటీలను, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. బహుమతులను అందించారు. కార్యక్రమంలో ఎకో టూరిజమ్ అసిస్టెంట్ డైరెక్టర్ శిరీష, డీఎం తనూజ, ఎఫ్‌ఆర్‌ఓ శ్రీనివాస్, ప్లాంటేషన్ మేనేజర్ లక్ష్మారెడ్డి, డిప్యూటీ రేంజ్ అధికారి శ్రీనివాసరెడ్డి, అధికారులు సుమన్, వీరకిషోర్, నేచరలిస్ట్ అపరంజని, రాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## హెచ్‌సీయూలో జింకల సందడి



హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ క్యాంపస్‌లో జింకలు సందడి చేశాయి. స్కూల్ ఆఫ్ ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్‌కు వెళ్ళే కొత్త రోడ్డు పక్కన కనిపించాయి. – రాయదుర్గం



## సీసీ రోడ్డు పనులు ప్రారంభం

**నిజాంపేట్:** కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి చొరవతో బుధవారం బాచుపల్లి 18వ డివిజన్ నందనవనం కాలనీలో రోడ్డు పనులను స్థానికులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నందనవనం కాలనీలో సీసీ రోడ్డులేక కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆయన దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఆయన స్పందించి మున్సిపల్ కార్పొరేషన్ ఫండ్స్ ద్వారా సీసీ రోడ్డు మంజూరు చేయించారన్నారు. మాజీ కార్పొరేటర్ కొలన్ వీరేందర్‌రెడ్డి, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్‌రెడ్డి రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ జనరల్ సెక్రటరీ కొలన్ జీవన్‌రెడ్డి, కొలన్ బాల్‌రెడ్డి, రాజేందర్, జిత్తు, సందీప్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## ట్రా'ఫికర్'

**జీడిమెట్ల:** ఐడీపీఎల్ చౌరస్తా నుంచి షాపూర్‌నగర్ వరకు బుధవారం ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు వాహనాలు ట్రాఫిక్‌లో ఇరుక్కున్నాయి. సమయానికి రెండు చౌరస్తాల్లో పోలీసులు లేకపోవడంతో ట్రాఫిక్‌లో మరింత అంతరాయం కలిగింది. ఐడీపీఎల్, చింతల్ మధ్యలో అంబులెన్స్ ట్రాఫిక్‌లో చిక్కుకుంది. ప్రతిరోజు మధ్యాహ్నం ఇదే తంతు కొనసాగుతుందని వాహనదారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

**పరిశ్రమ బస్సులు రోడ్లపై నిలుపడంతో..**

బాలానగర్ నుండి బొంతపల్లి, ఖాజీపల్లి, పోచమ్మైలారం, గండిమైసమ్మకు వెళ్లే పరిశ్రమల బస్సులు మధ్యాహ్నం ఎక్కువగా వెళ్తుంటాయి. ఈ సమయంలో బస్సుల్లో ఉద్యోగులను ఎక్కించుకునేందుకు డ్రైవర్లు రోడ్లపై బస్సులను నిలుపుతున్నారు. ఇది ట్రాఫిక్ పోలీసులు సైతం కనిపెట్టలేకపోతున్నారు. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర జాప్యం జరుగుతుంది. ఇప్పటికైనా పోలీస్ అధికారులు స్పందించి పరిశ్రమల బస్సులు రోడ్లపై నిలపకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

# ఆదాయంపై ఫోకస్ !

- పురపాలికల్లో ఆస్తులకు ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి
- పునరుద్ధరించుకోకపోతే జరిమానా విధించే అవకాశం




**సాక్షి, మేడ్చల్ జిల్లా:** అర్బన్, సెమీ అర్బన్‌గా అభివృద్ధి చెందిన నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని పురపాలికల్లో వ్యాపార లైసెన్సు రుసుం ద్వారా ఆదాయం పెంచుకోవడానికి అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. గత కొన్నేళ్లుగా దీనిపై పూర్తి స్థాయిలో దృష్టి సారించకపోవడంతో బల్దియాల ఆదాయానికి గండి పడిందని భావిస్తున్న అధికారులు ప్రస్తుతం వాణిజ్య, మిశ్రమ వినియోగ (గృహం, వాణిజ్య భవనం కలిసి ఉన్నవి) ఆస్తుల ప్రకారం ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి చేశారు.

◆ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని 16 పురపాలక సంఘాల పరిధిలో 18,056 వ్యాపార, వాణిజ్య సంస్థలు ఉండగా.. క్షేత్రస్థాయిలో 8,032 దుకాణాలకు మాత్రమే లైసెన్స్‌లు ఉన్నట్లు వార్డు అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది.

**10,645 దుకాణాలకు 3,825 లైసెన్సులు..**

జిల్లా పరిధిలోని బోడుప్పల్, నిజాంపేట్, జవహర్‌నగర్, దుండిగల్, కొంపెల్లి, నాగారం పురపాలికల్లో మొత్తంగా 10,645 వ్యాపార, వాణిజ్య సముదాయాలు ఉండగా.. 3,825 వాటికి మాత్రమే ట్రేడ్ లైసెన్సులు ఉన్నట్లు మున్సిపల్‌శాఖ గుర్తించింది. మిగతా 7,058 వ్యాపార సముదాయాలకు ట్రేడ్ లైసెన్సులు జారీ చేయలేదని తెలుస్తోంది.

◆ బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో 2035 వ్యాపార సముదాయాలు ఉండగా.. ట్రేడ్ లైసెన్సులు పొందిన దుకాణాలు (షాపులు) 455 మాత్రమే ఉన్నాయి. నిజాంపేట నగర పాలక సంస్థలో 4354కు 2135కు లైసెన్స్‌లు తీసుకున్నారు.

◆ జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో 750కి 282, దుండిగల్ మున్సిపాలిటీలో 1248 కి 432, కొంపెల్లిలో 1047కి 256, నాగారంలో 1211 వ్యాపార సముదాయాలకు 265 ట్రేడ్ లైసెన్సులు ఉన్నాయి. అదే పరిస్థితి మిగతా పురపాలికల్లో నెలకొని ఉందని తెలుస్తోంది.

**ఆసక్తి చూపని వ్యాపారులు..**

◆ బ్యాంకులో రుణం తీసుకున్న వారు తప్పా.. మిగతా వ్యాపార సముదాయాలకు సంబంధించిన వారంతా ట్రేడ్ లైసెన్సులు పొందటానికి ఆసక్తి చూపడం లేదు. దీంతో పురపాలక సంఘాల ఆదాయానికి భారీగా గండి పడుతోంది. జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం ద్వారా పురపాలక సంఘాల్లో మరింత ఆదాయాన్ని పెంచాల్సిన అవసరం ఉంది.

**అత్యధికంగా రూ.లక్ష ఫీజు**

◆ రహదారి విస్తరణ ఆధారంగా వాణిజ్య, వ్యాపార దుకాణాలకు కొలతలు తీసుకుంటున్నారు. సాధారణంగా ఒక చదరపు అడుగుకు రూ.5 చొప్పున లెక్కిస్తున్నారు. ఒక్కో దుకాణానికి వ్యాపార లైసెన్స్‌కు కనీసం రూ.200ల నుంచి అత్యధికంగా రూ. లక్ష ఉంటోంది. దీనికంటే అధిక మొత్తం వేయడానికి వీలు లేకుండా శ్లాబు విధించారు.

**పునరుద్ధరించుకోకపోతే..**

◆ ఆస్తిపన్ను మాదిరిగానే ఏటా దుకాణాలకు వ్యాపార లైసెన్స్ ఫీజు చెల్లించకపోతే జరిమానా విధిస్తారు. ఆర్థిక సంవత్సరం పూర్తయ్యేలోగా చెల్లించే వారికి ఎలాంటి అపరాధ రుసుము ఉండదు. ఆ తర్వాత పునరుద్ధరించుకోవడానికి దరఖాస్తు చేస్తే 25శాతం జరిమానా విధిస్తున్నారు.

**సమస్యలు ఇవే..**

◆ ఆన్‌లైన్‌లో చూపిస్తున్న దుకాణాలు, సంస్థలు, క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు. లైసెన్స్ వివరాలను ఒకసారి ఆన్‌లైన్‌లో నమోదు చేసిన తర్వాత వాటిని మార్చడం అసాధ్యం. దీంతో వ్యాపారి పేరుపై ఇంటి పేరుతో ట్రేడ్ లైసెన్స్ ఛార్జీలు నమోదవుతూనే ఉన్నాయి. కొందరు వ్యాపారులు వ్యాపారంలో దెబ్బతిని కొన్నేళ్లు మూసేసి, తర్వాత కొత్తగా వ్యాపారం ప్రారంభిస్తున్నారు. కొత్త వ్యాపారానికి లైసెన్స్ తీసుకోవాలనుకుంటే పాత వ్యాపారం లైసెన్స్‌కు సంబంధించిన బకాయిలు కట్టమంటున్నారని వ్యాపారులు వాపోతున్నారు.